# కన్నా కన్నా కన్నా

కన్నా,

నా కన్నతండ్రీ. నాకెంతో బాధగా ఉందిరా. ఇంకెంతో ఆనందంగానూ ఉందిరా.

నీకంత ధైర్యం ఎలా వచ్చిందిరా చిట్టితండ్రీ?

గొంగళిపురుగును చూసి నువ్వు భయపడ్డం నా కింకా గుర్తే.

"పిరికిసన్నాసి" అని నేను నవ్వినప్పుడు నువ్వు ఉడుక్కోవడం, అప్పుడు ఎర్రబడిన నీ ముఖం- జ్ఞాపకమొచ్చినప్పుడల్లా నాకు నవ్వొస్తూనే ఉంటుంది.

"అమ్మా, స్కూల్లో నరేంద్ర నన్ను రోజూ కొడుతున్నాడే" అని నాతో చెప్పినప్పుడు- "తిరిగి నువ్వూ కొట్టరా. ఇంక వాడు నీ జోలికి రాడు" అని నేనంటే, విని వూరుకున్నావు.

"పదమూడేళ్ళొచ్చాయి. వాణ్ణి కొట్టలేవా?" అని నేను రెట్టిస్తే "వాడు నాకంటే పెద్దోడే, లావుగా కూడా ఉంటాడు" అని నువ్వన్నప్పుడు, నీ కళ్ళల్లో భయం చూసి నాకు దిగులేసింది.

స్కూలు కొచ్చి మీ టీచర్‌తో చెప్పాను. నరేంద్రను దెబ్బలాడాను.

కొన్నాళ్ళు పోయేక, నరేంద్ర కొడుతున్నాడని మళ్ళీ ఫిర్యాదు చేశావు.

"నువ్వు పిరిగ్గా ఉంటే నరేంద్రేంటీ సురేంద్రా కొడతాడు" అని నేను చిరాకు పడ్డాను.

తరువాత నువ్వు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. మళ్ళీ ఎప్పుడో గుర్తొచ్చి "నరేంద్ర కొట్టడం మానేశాడా?" అని నేనడిగితే, కళ్ళు దించుకుని నువ్వు బుర్రూపినప్పుడు నాకు జాలేసింది. బాధేసింది. నిన్ను అక్కున చేర్చుకుని నీ తల నిమిరాను. వీడిలో పిరికితనం ఎలా పోతుందా అని ఆలోచిస్తూ బెంగపడిపోయాను.

నీ కంత ధైర్యం ఎలా వచ్చిందిరా కన్నా?

ఇంకోనాడు ఆడుకోడానికి వెళ్ళి, తలకు గాయంతో ఏడుస్తూ నువ్వింటికొస్తే, కంగారుపడిపోయాను. నీ తలమీది రక్తాన్ని చూసి హడలిపోయాను. డాక్టర్‌కు

చూపించి, కట్టు కట్టించి వచ్చాక- "దెబ్బెలా తగిలింది?" అని అడిగాను.

"దొంగాట ఆడుతున్నాం, నేను జోరుగా పరిగెడుతూ పడిపోయాను. తలకు రాయి తగిలేసింది" అని నువ్వన్నావు.

నువ్వబద్ధం ఆడేవని మర్నాడు తెలిసింది.

నువ్వూ, నీ ఫ్రెండూ దెబ్బలాడుకున్నారనీ, నీ ఫ్రెండు విసిరిన రాయి తగిలి నీ తలకు గాయమైందనీ సురేంద్ర చెప్పాడు. నా గుండె తరుక్కుపోయింది.

"అవతలి వాడిని తిరిగి కొట్టలేదేం?" అని నేను తిడతానేమోననే భయంతో అబద్ధం ఆడావు. అబద్దం ఆడినందుకు నేనే నిన్ను కొడదామనుకున్నాను. మనస్కరించలేదు. తిట్టాను. ముఖం మాడ్చుకున్నావు.

నువ్వింత ధైర్యవంతుడివి అవుతావని నేనెప్పుడూ అనుకోలేదురా కన్నా!

కిందటి ఆదివారం. అప్పుడే వారం రోజులయింది. ఆమె నీ కేమవుతుందని అంత సాహసం చేశావు? చీరకొంగు అంటుకుని లబోదిబో మంటున్నప్పుడు ఆమె కొడుకూ అక్కడే ఉన్నాడట కదా, వాడు ఏడాదో, ఏణ్ణర్దమో నీ కంటే పెద్దవాడు కూడాను. సొంత కొడుకే చేయలేకపోయిన సాహసం వాడి నేస్తానివైనందుకు నువ్వు చేశావా కన్నా!

మంటల్ని నీ లేత చేతులతో పట్టేసుకోడానికి నీకు భయం వేయలేదూ? వెనకనుంచి ఆమెను గట్టిగా కౌగలించేసుకున్నావట. ఆమెకవ్వాల్సిన గాయాలు చొక్కాలేని నీ ఒంటి కయ్యాయి. కరివేపాకు కోసం నిన్నక్కడకు పంపకపోయినా బావుండే దనిపిస్తోంది ఒకోసారి.

నీ సాహసం గురించి విన్నవాళ్ళంతా ఎంతో గొప్పగా చెప్పుకుంటూ ఉంటే ఎంతో ఆనందంగా ఉంది. నీ ఒంటిని చూస్తుంటే మాత్రం చాలా బాధగా ఉందిరా కన్నా.

కాలిన గాయాలకు మందు రాస్తుంటే ఏడుపొస్తోందిరా కన్నా.

'నిన్ను నువ్వు రక్షించుకో' అని చెబితే ఇతరుల్ని కూడా రక్షించే స్థాయికి ఎదిగిపోయావు.

ఇక నీగురించి నాకే బెంగాలేదు. ఎంత మంచి దారిలో పడ్డావురా కన్నా.

నా చిట్టితండ్రీ, నా కన్నతండ్రీ!

*(ఆంధ్రప్రభ వారపత్రిక, 27-7-1988)*